# సాక్షి
# విశాఖపట్నం

మంగళవారం, 20, మే, 2025







నాణ్యతే ప్రామాణికం.. అవగాహనే కీలకం 8లో





రీ ఓపెన్ అర్జీలపై కలెక్టర్ అసంతృప్తి 8లో





నేటి నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల సమ్మె 8లో


## న్యూస్‌రీల్

### ముగ్గురు సీఐలకు స్థానచలనం



**విశాఖ సిటీ:** నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ జి.అప్పారావును మల్కాపురం లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన విద్యాసాగర్‌పై ఒక మహిళ ఫిర్యాదు చేయడంతో ఆయనపై వేటు పడింది. ఒక ఫిర్యాదు చేయడానికి ఆమె స్టేషన్‌కు వస్తే.. సీఐ ఫోన్లు, మెసేజ్‌లతో వేధింపులకు గురిచేస్తున్నారని సీపీ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. విచారణ అనంతరం విద్యాసాగర్‌ను రేంజ్‌కు సరెండర్ చేశారు. దీంతో ఆ స్థానంలో అప్పారావును నియమించారు. అలాగే సీఎస్‌బీ-3లో ఉన్న ఎన్.వి.ప్రభాకరరావును గోపాలపట్నం లా అండ్ ఆర్డర్‌కు, వీఆర్-1లో ఉన్న జి.గోవిందరావును సీఎస్‌బీ-3కు బదిలీ చేశారు.

### ఈపీడీసీఎల్ సీఎండీ పేరుతో ఫేక్ వాట్సాప్!

**సాక్షి, విశాఖపట్నం:** 'నేను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి. మీ విద్యుత్ కనెక్షన్ల విషయంలో గందరగోళం ఉంది. కాబట్టి.. మీపై యాక్షన్ తీసుకుంటాను..' అంటూ ఓ ఫేక్ నంబర్‌తో కొందరు వినియోగదారులకు వాట్సాప్‌లో మెసేజ్‌లు వెళ్లాయి. మరికొందరికి తొలుత హాయ్.. అని మెసేజ్‌పెట్టిన తర్వాత రిప్లయ్ ఇస్తుంటే.. అర్జెంట్‌గా లక్ష రూపాయిలు కావాలంటూ మెసేజ్‌లు చేస్తున్నారు. వాట్సాప్ డిస్‌ప్లే పిక్చర్(డీపీ)లో సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఫొటో ఉండటంతో.. కొందరు అధికారులకు అనుమానం వచ్చి స్వయంగా సీఎండీకి కాల్ చేసి చెప్పారు. వెంటనే ఆయన అప్రమత్తమయ్యారు. 9702068556 అనే నంబర్ నుంచి పలువురికి వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు చేస్తున్నట్లు గుర్తించారు. ఇది స్పామ్ నంబర్ అనీ.. ఈ నంబర్‌తో వచ్చే మెసేజ్‌లకు ఎవరూ స్పందించొద్దంటూ సీఎండీ పృథ్వీతేజ్ అందరికీ విజ్ఞప్తి చేశారు. తన పేరుతో మెసేజ్‌లు చేస్తున్న సైబర్ నేరగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సీఎండీ తెలిపారు.



సీఎండీ పేరుతో వాట్సప్ ఫేక్ ప్రొఫైల్

### పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

**విశాఖ విద్య:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు/హిందీ పరీక్షలకు 1,031 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 817 మంది హాజరయ్యారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ రెండు కేంద్రాలు, స్క్వాడ్ బృందాలు 29 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అదే విధంగా ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు 34 మందికి విద్యార్థులకు గాను 29 మంది హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్మీడియెట్ పరీక్షలకు 119 మందికి గాను 98 మంది విద్యార్థులు హాజరయ్యారు.

### సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

**డాబాగార్డెన్స్:** తెలంగాణలోని కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు విశాఖ నుంచి ప్రత్యేక సర్వీసు నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ నెల 23 మధ్యాహ్నం 2 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి ప్రత్యేక సర్వీసు ప్రారంభమవుతుందని చెప్పారు. టికెట్ ధర రూ.2700 నిర్ణయించినట్టు తెలిపారు. టికెట్లు https://www. apsrtconline.in/వెబ్‌సైట్‌లో తీసుకోవచ్చన్నారు. అలాగే ద్వారకాబస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద కూడా ముందుగా టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. 34 మంది కలిసి వస్తే వారికి అనుకూలమైన రోజున బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా విజ్ఞాన, విహార యాత్రలకు ఆర్టీసీ సర్వీసులు అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్టు తెలిపారు. వివరాలకు 8309265666, 9959225602, 9052227083, 9959225594 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

### జైల్లో రౌడీ షీటర్లకు తరగతులు

**ఆరిలోవ:** విశాఖ కేంద్ర కారాగారంలో రౌడీ షీటర్లకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. జైలులో ఉన్న 32 మంది రౌడీ షీటర్ల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత సమాజంలో ఎలా మెలగాలి, క్రమశిక్షణతో ఎలా ఉండాలి అనే విషయాలపై జైలు ఉపాధ్యాయుడు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. వారిలో సానుకూల మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

# కూటమిలో డిప్యూటీ చిచ్చు

- జనసేనకు డిప్యూటీ మేయర్ కేటాయింపుపై ససేమిరా అంటున్న టీడీపీ నేతలు
- 22 రోజుల క్రితం ఉన్న ఐక్యతా రాగం 'కౌన్సిల్ సాక్షిగా' విచ్ఛిన్నం
- కూటమి పార్టీల్లో బయటపడ్డ లుకలుకలు

**డాబాగార్డెన్స్ :** ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవనేది నానుడి. దీనికి తగ్గట్టుగానే జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవి టీడీపీ, జనసేన మధ్య చిచ్చురేపింది. మొన్నటి మేయర్ ఎన్నిక వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఇరుపార్టీల నేతల్లో అసహనం వ్యక్తమైంది. ఇన్నాళ్లు కూటమి పార్టీలంతా ఒక్కటేనని బయటకు చెబుతున్నా.. ఈ ఎన్నిక సందర్భంగా లుకలుకలు బయటపడ్డాయి. సంఖ్యాబలం ఉండి కూడా కోరం లేక సమావేశం వాయిదా పడిందంటే.. పదవుల కోసం తప్ప ప్రజలకు మేలు చేయాలని వారు కలవలేదని తేలిపోయింది. డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశం సోమవారం జరిగింది. ఈ పదవిని జనసేనకు కేటాయించగా టీడీపీ ఆశావహులు సమావేశానికి దుమ్మా కొట్టారు. ఎలాగైనా తమకే ఈ పదవి దక్కాలని భీష్మించారు. దీంతో కోరం లేక సమావేశం మంగళవారం నాటికి వాయిదా పడింది. జనసేన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తితో అలిగి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

**చివరి వరకు ఆశావహుల ప్రయత్నాలు**

మేయర్‌గా పీలా శ్రీనివాసరావును కూటమి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. టీడీపీ ఆశావాహులు మాత్రం గత వారం రోజులుగా ఈ పదవి కోసం చాలా ప్రయత్నాలు చేశారు. ఎవరికి వారు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ తనకే పదవి వచ్చేలా చూడాలంటూ శతవిధాలా ప్రయత్నాలు చేశారు. అయితే జనసేన పార్టీకే డిప్యూటీ మేయర్ పదవి కేటాయించారు. ఆ పార్టీకి చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డికి ఆ పార్టీ నేతలు బీ ఫారం అందజేశారు.



ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, విజయ్‌కుమార్, పంచకర్లతో డిప్యూటీ మేయర్ అభ్యర్థి దల్లి గోవిందరెడ్డి

**కారాలు మిరియాలు**

జనసేనకు చెందిన దల్లి గోవిందరెడ్డికి బీ ఫారం ఇవ్వడంతో టీడీపీ కార్పొరేటర్లు జీర్ణించుకోలేకపోయారు. ఎన్నికకు వెళ్లే ప్రసక్తే లేదని భీష్మించారు. మంగళవారం ఉదయం నగరంలోని ఓ హోటల్లో భేటీ అయిన టీడీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయారు. హోటల్ నుంచి ఓ వర్గం టీడీపీ కార్పొరేటర్లు వేరే చోటికి వెళ్లిపోయారు. ఓ వర్గం టీడీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశానికి హాజరైనా.. కోరానికి సరిపడా సభ్యులు లేకపోవడంతో జనసేన ఆశలు ఆవిరైనట్టయింది. దీంతో ఇరు పార్టీల నేతలు కారాలు మిరియాలు నూరుకున్నారు.

**ఇంతలోనే అంత..**

గత నెల 28న మేయర్ ఎన్నిక నిర్వహించారు. కుట్రలు, కుతంత్రాలతో నిర్వహించిన ఎన్నికలో పీలా శ్రీనివాస్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 22 రోజుల తర్వాత నిర్వహించిన డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి పార్టీల్లో లుకలుకలు బయటపడ్డాయి. కేవలం అధికారం కోసం ఏర్పడిన పొత్తు కాబట్టి ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు.

**దల్లిపై ఎన్ని ఫిర్యాదులో..**

డిప్యూటీ మేయర్ పదవి కోసం ఇటీవలే వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన పలువురు కార్పొరేటర్లు.. తొలి నుంచి జనసేన పార్టీలో ఉన్న దల్లి గోవిందరెడ్డిపై అధిష్టానానికి పలు ఫిర్యాదులు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దల్లి గోవిందరెడ్డి గుట్కా వ్యాపారితో అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారంటూ ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. అవి అవాస్తవమని నమ్మిన పార్టీ అధిష్టానం దల్లి గోవిందరెడ్డికే డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చేందుకు మొగ్గు చూపింది. బీ ఫారం అందజేయడంతో ఆ పార్టీలో చేరిన వారంతా ఖంగుతిన్నట్టయింది.

**జంప్ జిలానీలు తెల్లముఖం**

స్వార్థ రాజకీయాలు, డబ్బులకు అమ్ముడుపోయి వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన కార్పొరేటర్లు, ఇద్దరు స్వతంత్ర కార్పొరేటర్లు వారు ఆశించినట్టు సాగకపోవడంతో తెల్లముఖం వేసినట్టయింది. ఎందుకు పార్టీని వీడామని మధనపడుతున్నట్లు తెలుస్తోంది.




హాజరైన ఎమ్మెల్యేలు పల్లా, వెలగపూడి, ఎమ్మెల్సీ వేపాడ

**టీడీపీలో ముసలానికి కారణం వీరే..**

డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలో మేయర్ పీలా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు ముసలం పెట్టారని ఆ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు బాహాటంగా అంటున్నారు. మేయర్ పీలా శ్రీనివాస్ గాజువాక నియోజకవర్గానికి చెందిన గంధం శ్రీనివాస్‌కు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆ నియోజకవర్గ యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ మంగవేణికి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆ నియోజకవర్గం యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ మొల్లి హేమలతకు హామీ ఇచ్చి వారిలో ఆశలు రెక్కెత్తించారనే ఆరోపణలు భగ్గుమంటున్నాయి. ఏది ఏమైనా కూటమిలో చిచ్చుకు కారకులు వీరేనంటూ పలువురు కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు.

**చరిత్రలోనే లేదు..**



కోరం లేక సమావేశం వాయిదా పడడం జీవీఎంసీ చరిత్రలోనే లేదని వైఎస్సార్ సీపీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల సత్య శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమిలో సఖ్యత లేదనడానికి సోమవారం జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికే నిదర్శనమని పేర్కొన్నారు. 63 మంది కార్పొరేటర్లలో 20 మంది వరకు డిప్యూటీ మేయర్ ఎన్నికకు దుమ్మా కొట్టారంటే కూటమిలో లుకలుకలు తేటతెల్లమయ్యాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడీ చేసే ఆలోచనే తప్ప.. ప్రజాసమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

# జనసేనకు టీడీపీ జెల్ల

- పొత్తు ధర్మం విస్మరించి డిప్యూటీ మేయర్ ఎన్నిక సమావేశానికి డుమ్మా కొట్టిన పలువురు టీడీపీ కార్పొరేటర్లు
- ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్యే కూడా గైర్హాజరు
- కోరంకు 56 మంది అవసరం కాగా 54 మంది హాజరు
- నేటికి ఎన్నిక వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి ప్రకటన



సభ్యుల గైర్హాజరుతో ముందు వరుసలో ఖాళీగా ఉన్న కుర్చీలు

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికలో జనసేనకు మిత్రపక్షమైన టీడీపీ జెల్ల కొట్టింది. పొత్తు ధర్మం మరిచి డిప్యూటీ మేయర్ కుర్చీ కోసం కుయుక్తులు పన్నింది. డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయించగా.. సోమవారం జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి పలువురు టీడీపీ ఆశావహులు దుమ్మా కొట్టారు. దీంతో కోరం లేకపోవడంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ మంగళవారం నాటికి సమావేశం వాయిదా వేశారు. ముందస్తు సమాచారం మేరకు డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రారంభం కావాల్సి ఉంది. ఆ సమయానికి బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఆ పార్టీ కార్పొరేటర్ కవితతోపాటు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ హాజరయ్యారు. 11.10 గంటలకు జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు కౌన్సిల్‌కు వచ్చారు. 11.15 గంటలకు జనసేనకు చెందిన 14 మంది కార్పొరేటర్లు సమావేశ మందిరానికి చేరుకున్నారు. 11.20 గంటలకు టీడీపీ ఎమ్మెల్యే గణబాబు వచ్చారు. 11.30 గంటలకు టీడీపీ కార్పొరేటర్లు(కాకి గోవిందరెడ్డి తప్ప) ఎవరూ హాజరు కాలేదు. మరో అర గంట మాత్రమే సమావేశం నిర్వహించేందుకు సమయం ఉంది. ఇంతలో ఒకరినొకరు చెవులు కొరుక్కునే పనిలో పడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాస్ 11.40 గంటలకు కౌన్సిల్ హాల్లోకి అడుగుపెట్టారు. అప్పటికే మేయర్ పీలా శ్రీనివాస్‌తో పాటు జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మల్లగుల్లాలు పడుతున్నారు.

**11.53 గంటలకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి రాక**

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ 11.53 గంటలకు సమావేశానికి హాజరయ్యారు. (వాస్తవానికి సభ్యులకు ఇచ్చిన సమయానికే రావాలి). వచ్చిన వెంటనే ఎంత మంది సభ్యులు వచ్చారో లెక్కించాలని అధికారులను ఆదేశించారు. కోరం సరిపడా సభ్యులు లేకపోయినా ఇద్దరు అధికారులు (ఏడీసీ డి.వి.రమణమూర్తి, కార్యదర్శి బి.వెంకటరమణ) అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇంకా వస్తారా.. సార్ అంటూ ఎమ్మెల్యేల చుట్టూ తిరిగారు. 12.10 గంటలైనా అధికారులిద్దరూ లెక్కపెడుతూనే ఉన్నారు. అప్పటికే సమయం మించిపోవడంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ నేరుగా సభ్యులను లెక్కించారు. ఎన్నికకు 56 మంది అవసరం కాగా 54 మందే హాజరయ్యారని.. కోరం తగ్గట్టు సభ్యులు లేరని గుర్తించారు. దీంతో సమావేశాన్ని మంగళవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జనసేన ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# రేపు డీఈవో కార్యాలయం ముట్టడిస్తాం..

- ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక అల్టిమేటం
- కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం
- డీఈవోకు నోటీస్ అందజేసిన నాయకులు

**విశాఖ విద్య:** ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవారం ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు ముందస్తు నోటీస్ అందజేశారు. తమ సమస్యలకు పరిష్కారం లభించేంత వరకు దశలవారీగా పోరాటాలకు సిద్ధమన్నారు. అంతకు ముందు డీఈవో కార్యాలయం వద్ద సమావేశమైన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ 117 జీవో రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా కూటమి ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూర్చేలా ఉన్నాయన్నారు. తొమ్మిది రకాల బడులు విద్యారంగాన్ని మరింత ప్రమాదంలో నెట్టే అవకాశం ఉందన్నారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి అసంబద్ధమైన నిర్ణయాలతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఐక్యవేదిక పిలుపులో భాగంగా చేపట్టే డీఈవో కార్యాలయ ముట్టడికి ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు అంతా తరలిరావాలన్నారు. ప్రభుత్వానికి ఉపాధ్యాయుల గళాన్ని వినిపించేలా ముట్టడిని విజయవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ చొక్కాకుల సూర్యనారాయణ(వైఎస్సార్‌టీఏ), వేణుగోపాల్ (ఏపీహెచ్‌ఎంఏ), టి.రామకృష్ణ (ఏపీటీఎఫ్-257) జి.చిన్నబ్బాయి (యూటీఎఫ్), అరుణ్ కుమార్ (ఏపీయూఎస్) ఎన్.ధనుంజయరావు (ఏపీటీఎఫ్-1938)బి.చిన్నారావు, పీఆర్‌టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డీఈవోకు నోటీస్ అందజేస్తున్న నాయకులు

# బుద్ధిస్ట్ సర్క్యూట్స్ కోసం డీఎంవో

**సాక్షి, విశాఖపట్నం:** బౌద్ధారామాల్ని పర్యాటక ప్రాంతాలుగా మరింత అభివృద్ధి చేసేందుకు ఏపీ టూరిజం అథారిటీ(ఏపీటీఏ) కొత్త ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బౌద్ధారామాల్ని గుర్తిస్తూ.. ఆయా ప్రాంతాల్లో ఉన్నవాటిని బుద్ధిస్ట్ సర్క్యూట్స్‌గా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. గత ప్రభుత్వ హయాంలోనే దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. దానికనుగుణంగా విశాఖలోనూ బుద్ధిస్ట్ సర్క్యూట్ ఏర్పాటు కోసం రెండు సర్క్యూట్స్‌ను ప్రతిపాదించారు. కంప్లీట్ బుద్ధిస్ట్ సర్క్యూట్‌గా విశాఖలోని బౌద్ధారామాలు, అమరావతిలోని బౌద్ధారామాల్ని గుర్తించారు. అదేవిధంగా విశాఖపట్నం సర్క్యూట్‌గా శ్రీకాకుళంలోని శాలిహుండం, విశాఖలోని బావికొండ, తొట్లకొండ, అనకాపల్లిలోని బొజ్జనకొండ, తూర్పుగోదావరి జిల్లాలోని అదుర్రు బౌద్ధారామాల్ని గుర్తించారు. ఈ సర్క్యూట్స్ అభివృద్ధి, నిర్వహణ, మార్కెటింగ్, ప్రమోషన్ కోసం రాష్ట్ర స్థాయి కమిటీతో పాటు డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్స్(డీఎంవో)ను ఏర్పాటు చేస్తూ టూరిజం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ డీఎంవోకు విశాఖ జిల్లా కలెక్టర్ చైర్మన్‌గానూ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, ఏయూ ప్రొఫెసర్, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల ప్రతినిధులు, టూరిజం శాఖ విశాఖ ఆర్‌డీ, విశాఖ, అనకాపల్లి జిల్లా టూరిజం అధికారులు, ఏపీటీడీసీ విశాఖ డివిజనల్ మేనేజర్, ఈఈలు మెంబర్లుగా వ్యవహరించనున్నారు. బుద్ధిస్ట్ సర్క్యూట్స్ వద్ద మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలు, స్పాన్సర్‌షిప్‌ల సహాయంతో బౌద్ధారామాల వద్ద పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడం మొదలైనవన్నీ డీఎంవోలు చూస్తాయని పేర్కొన్నారు.



తొట్లకొండ బౌద్ధారామం

# యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

**మహారాణిపేట:** జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన, జిల్లాలో 2.50 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే స్థలాలు గుర్తించామని, శిక్షణలు ప్రారంభించామని, మాసోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్‌లో 500 మందితో ప్రాథమిక వేడుకలు ప్రారంభిస్తామని, అనంతరం మండల, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో భవానీశంకర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో గందరగోళం

**ఖాళీల సంఖ్యపై స్పష్టత కరవు**

**విశాఖ విద్య:** ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభానికి సిద్ధమవుతున్నప్పటికీ, ఖాళీల సంఖ్యపై స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో గందరగోళం నెలకొంది. అన్ని కేడర్లను కలిపి మొత్తం 4,811 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా చూపించారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో అయితే 780 పోస్టులు క్లియర్ వేకెన్సీల జాబితాలో ఉన్నాయి. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల సంఖ్య 2,121గా ఉంది. వీరితో పాటు ప్రత్యేక సెలవుపై ఇతర దేశాలకు వెళ్లిన ఐదుగురు, రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా 1,851 మంది, స్టడీ లీవ్‌లో ఉన్న 51 మంది, దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్న ముగ్గురు ఉపాధ్యాయుల పోస్టులను కూడా ప్రస్తుత బదిలీల జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ వివరాలను జిల్లా విద్యాశాఖాధికారులు ఇంకా ధ్రువీకరించకపోవడంతో ఉపాధ్యాయుల్లో సందిగ్ధత నెలకొంది. ముఖ్యంగా మున్సిపల్ పాఠశాలల్లోని ఖాళీల విషయంలో చివరి నిమిషం వరకు అధికారులు తర్జనభర్జన పడ్డారు. భీమునిపట్నం, మాధవధార, ఆర్పీ పేట వంటి పాఠశాలల్లో సంబంధిత డీడీవోల ప్రమేయం లేకుండానే జాబితాలో మార్పులు చేర్పులు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. జాబితాలను వెల్లడించేందుకు అధికారులు, కార్యాలయ సిబ్బంది దాటవేత ధోరణిని అవలంబిస్తుండటంతో తెరవెనుక ఏదో జరుగుతోందని ఉపాధ్యాయులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# స్టీల్‌ప్లాంట్ సమ్మెకు వైఎస్సార్ సీపీ మద్దతు



సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ నేతలు

**పెదగంట్యాడ:** అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టనున్న స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు వైఎస్సార్ సీపీ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు, ఎంతో మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా అడ్డుకుంటామన్నారు. నిర్వాసితుల నుంచి 26 వేల ఎకరాల భూమిని తీసుకుని కేవలం 16,500 మందికి ఆర్ కార్డులు ఇచ్చి అందులో కేవలం 8 వేల మందికి ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చలు జరిపి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా కాపాడాలని కోరారు. నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నారని.. ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపేస్తున్నారని.. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, కోమటి శ్రీనివాసరావు, మంత్రి శంకర్‌నారాయణ, బొడ్డ గోవింద్, సిరట్ల శ్రీనివాస్ గౌడ్, చిత్రాడ వెంకటరమణ, మద్దాల అప్పారావు, డీవీ రమణారెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెతో చావో రేవో తేల్చుకుందాం..



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

- సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- నేడు స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మంగళవారం జరగనున్న సమ్మెతో చావో రేవో తేల్చుకుందామని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్మృత్యంజలి పార్కు వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ నుంచి కాపాడుకోవడం కార్మికుల జీవన్మరణ సమస్యగా ఉందన్నారు. ప్లాంట్ ఉద్యమం ఒంటరి కాదని దీనికి దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలు మద్దతు ఇస్తున్నాయన్నారు. కార్మికవర్గం మరింత ఐక్యంగా ప్రభుత్వ, యాజమాన్యాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మరింత పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం నిర్బంధాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మె విజయవంతం చేయాలన్నారు. స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య విధానాలకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కార్పొరేటర్ గంగారావు, జిల్లా సీఐటీయూ నాయకులు జగ్గునాయుడు, ఆర్.ఎస్.వి.కుమార్, కె.ఎం.శ్రీనివాస్, నాయకులు వై.టి.దాస్, గణపతి రెడ్డి, కె.ఎస్.ఎన్.రావు, కె.సత్యనారాయణ, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమ్మె

మహారాణిపేట: కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు మంగళవారం నుంచి సమ్మె చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో 23 తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసే డ్రైవర్లకు నెలకు కేవలం రూ. 8వేలు వేతనం అందుతోంది. అరబిందో కంపెనీ ద్వారా ప్రస్తుతం వేతనాలు అందుతుండగా, త్వరలో కొత్త కాంట్రాక్టర్ రానున్న నేపథ్యంలో సిబ్బంది తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఒత్తిడి పెంచుతున్నారు. యూనియన్ అధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ నిబంధనల ప్రకారం డ్రైవర్లకు రూ. 18,500 వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.



# నాణ్యతే ప్రామాణికం.. అవగాహనే కీలకం

- వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- కొలతల్లో మోసాలు జరిగితే అధికారులను సంప్రదించాలి
- నేడు ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవం

తాటిచెట్లపాలెం: వినియోగదారులు నాణ్యమైన ఉత్పత్తులు పొందడం ఎంత ముఖ్యమో, వాటి గురించి సరైన అవగాహన కలిగి ఉండటం కూడా అంతే కీలకం. కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యతను పరిశీలించడంతో పాటు, వాటి తయారీ, కొలతలు, ధర వంటి వివరాలపై అవగాహన పెంచుకుంటే మోసాల నుంచి బయటపడొచ్చు. ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువులోనూ తూనికలు, కొలతల విషయంలో జాగ్రత్త వహించాలని లీగల్ మెట్రాలజీ ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కే థామస్ రవికుమార్ సూచించారు. మంగళవారం ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా ఆయన ఈ విషయమై మాట్లాడారు. ప్రతి సంవత్సరం మే 20న ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1875లో పారిస్‌లో జరిగిన మీటర్ కన్వెన్షన్‌కు గుర్తుగా ఈ దినోత్సవం జరుగుతుంది. ఈ సంవత్సరం లీగల్ మెట్రాలజీ 150వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. 2025 లీగల్ మెట్రాలజీ డే 'కొలతలు అన్ని కాలాలకు – అందరు ప్రజలకు' నినాదంతో సాగుతుంది. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా లీగల్ మెట్రాలజీ విభాగం ఈ నెల 8 నుంచి 19 వరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అవగాహన శిబిరాలు, తనిఖీలు నిర్వహించింది. ఆయా ప్రాంతాలలో వస్తువులను కొనుగోలు చేసేటపుడు ప్రజలు ఎలా మోసపోతారో, ప్రజలను వ్యాపరులు ఎలా మోసగిస్తారో వివరించారు. తూనికలు, కొలతలు, ప్యాకేజీ వస్తువుల విషయంలో వినియోగదారులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు.

**బంగారు ఆభరణాల విషయంలో...**

బంగారు ఆభరణాలు కొనేటప్పుడు రాళ్లు, బంగారం వేర్వేరుగా తూకం వేస్తున్నారో లేదో చూడాలి. బిల్లులో నికర బరువు, ధర, స్వచ్ఛత వివరాలు పరిశీలించాలి. కొనుగోలు సమయంలో మిల్లీగ్రాము వరకు ఖచ్చితత్వమున్న ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలను, వాటికి లీగల్ మెట్రాలజీ సీల్ ఉందో లేదో గమనించాలి.

**పెట్రోలు బంకుల్లోనూ..**

పెట్రోల్, డీజిల్ కొనే ముందు పంప్ మీటర్ 0 తో మొదలయ్యేలా చూడాలి. సరైన ధర చెల్లిస్తున్నారో లేదో గమనించాలి. అనుమానం ఉంటే, పెట్రోల్ బంకుల్లో ఉండే లీగల్ మెట్రాలజీ సీల్ ఉన్న ఐదు లీటర్ల కొలత పాత్రతో పరిమాణం సరిచూసుకోవాలి.

**ప్యాకేజీ వస్తువుల విషయంలో..**

ప్యాకేజీ వస్తువులు కొనే ముందు బరువు, కొలత, తయారీ తేదీ, గరిష్ట అమ్మకపు ధర, కస్టమర్ కేర్ వివరాలు చూడాలి. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ చెల్లించకూడదు. ఎవరైనా ఎక్కువ ధర డిమాండ్ చేస్తే లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వే స్టేషన్‌లు, బస్ స్టాండ్‌లు, సినిమా థియేటర్‌లు, హోటళ్లు, మార్కెట్‌లు, కిరాణా, సూపర్ మార్కెట్‌లలో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ చెల్లించకూడదు.


బంగారం షాపులో స్వచ్ఛతను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు (ఫైల్)

**2024-25 సంవత్సరంలో లీగల్ మెట్రాలజీ గణాంకాలు...**

జిల్లాలో నమోదు చేసిన కేసులు - 1500
స్టాంపింగ్ ఫీజు - రూ.2,34,88,983
కాంపౌండింగ్ ఫీజు (అపరాధరుసుము/ జరిమానాలు)- రూ.1,16,75,710

**2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన తనిఖీలు, కేసులు**

| షాపులు | తనిఖీలు | కేసులు |
|---|---|---|
| ఎఫ్‌పీ షాప్స్ | 90 | 18 |
| ఎంఎల్‌ఎస్ పాయింట్స్ | 26 | 12 |
| రైస్ షాపులు | 101 | 9 |
| ఎడిబుల్ ఆయిల్స్ | 64 | 13 |
| ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ | 58 | 09 |
| సిమెంట్ షాప్స్ | 49 | 3 |
| డిస్పెన్సింగ్ పంప్స్ | 255 | 37 |
| ఎల్పీజీ డీలర్స్, బాట్లింగ్ యూనిట్స్ | 89 | 14 |
| ఐరన్ అండ్ స్టీల్ ట్రేడర్స్ | 156 | 23 |
| హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ షాప్స్ | 670 | 186 |
| టెక్స్‌టైల్, రెడీమెడ్ గార్మెంట్స్ | 205 | 36 |
| ఎలక్ట్రానిక్స్ అండ్ మొబైల్ షాప్స్ | 138 | 22 |
| ఆటోమొబైల్స్, లూబ్రికెంట్స్ | 128 | 27 |
| కూరగాయలు, ఫ్రూట్స్ షాప్స్, వీక్లీ బజార్స్, రైతుబజార్స్ | 976 | 135 |
| ఫిష్, పౌల్ట్రీ, చికెన్, మటన్ షాప్స్ | 541 | 95 |
| స్వీట్స్ అండ్ సేవరీస్ | 425 | 122 |
| ఐస్‌క్రీమ్స్ షాప్స్ | 137 | 24 |
| కిరాణా అండ్ జనరల్ | 415 | 120 |
| షాపింగ్ మాల్స్ | 92 | 41 |
| హోల్‌సేల్, రిటైల్ డీలర్స్ | 290 | 55 |
| మొత్తం | 4903 | 1001 |

# అర్జీల రీ ఓపెన్‌పై కలెక్టర్ అసంతృప్తి

- వచ్చే వారం అర్జీదారులతో స్వయంగా నేనే మాట్లాడతా
- అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 225 వినతులు


అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో గ్రామ సభల్లోని సమర్పించిన అర్జీలు రీ-ఓపెన్ అవుతుండడంపై కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండిం గ్ అర్జీలపై సమీక్షించి, అర్జీదారులతో స్వయంగా మాట్లాడి, కచ్చితమైన సమాచారంతో పొరపాట్లు లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు, అర్జీదారులు మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా 1100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. వచ్చే సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా అధికారుల సమక్షంలో అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడతానని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటల్లో తెరిచి, పూర్తిగా విచారణ చేసి, మళ్లీ రాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన అర్జీదారుల సమస్యలు వింటూ, వాటిని సంబంధిత అధికారులకు పంపి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం మొత్తం 225 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 91 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 18, జీవీఎంసీ సంబంధించి 51 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 65 వినతులు వచ్చాయి.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణ



జీవీఎంసీ జోన్-2, మధురవాడలోని ప్రభుత్వ పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. బొట్టవానిపాలెంలోని ఈడబ్ల్యూఎస్ లేఔట్, స్వతంత్ర నగర్‌లోని కోట్ల రూపాయల విలువైన జీవీఎంసీ పార్కులో 150 గజాల స్థలాన్ని కొందరు ఆలయం పేరుతో ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ఈ నెల 5న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. కళానగర్‌లోని కృష్ణ నగర్ పార్కు, బ్రహ్మంగారి గుడి ఎదురుగా ఉన్న మరో పార్కు స్థలం కూడా కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణదారులకు జోనల్ కమిషనర్ మద్దతు ఇస్తున్నారు. కలెక్టర్, జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కులను కాపాడాలి. –చేకూరి రజని, సామాజిక కార్యకర్త, మధురవాడ

## పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వండి



పెందుర్తి రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు పట్టాదారు పుస్తకాల కోసం రైతులను పదే పదే తిప్పిస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు పని చేస్తున్నారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కంపరపాలెం గ్రామంలోని సర్వే నంబర్ల భూములకు పట్టాదారు పుస్తకాలు ఇప్పించాలి. భూములను ఆన్‌లైన్ చేసి న్యాయం చేయాలి. సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి.

–కె.రామకృష్ణ, అధ్యక్షుడు, కంపరపాలెం నవ భారతి యువజన సేవా సంఘం, నరవ




# పరవాడలో యువకుడి హత్య

**చీటి డబ్బుల వివాదమే కారణం**


హత్యకు ఉపయోగించిన కత్తి


మృతుడు బంగార్రాజు

పరవాడ: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో ఆదివారం రాత్రి చీటి డబ్బుల విషయంలో జరిగిన ఘర్షణలో మైలపల్లి బంగార్రాజు (35) అనే యువకుడు కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న బంగార్రాజు చీటిల వ్యాపారం చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన చింతకాయల ఎర్రయ్య అతనికి రూ.18 వేలు బాకీ ఉన్నాడు. ఈ విషయంపై ఫోన్‌లో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అక్కడే ఉన్న ఎర్రయ్య మేనల్లుడు కొవిరి కామేష్ కత్తితో బంగార్రాజును పొడవడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కామేష్‌తో పాటు మరో ఆరుగురు దాడిలో పాల్గొన్నట్లు గుర్తించారు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. భర్తను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంగార్రాజు భార్య బంగారమ్మ, కుటుంబ సభ్యులు సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## అసభ్యకరంగా ప్రవర్తించిన యువకునికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: నాలుగేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన టి.శివ అనే యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25 వేలు పరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి పి. మంగాదేవి సోమవారం తీర్పునిచ్చారు. నిందితుడు చెల్లించిన జరిమానా మొత్తాన్ని బాధితురాలికి అందజేయాలని స్పష్టం చేశారు. కేసు వివరాలను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ మీడియాకు తెలిపారు. నిందితుడు శివ కొత్త గాజువాకలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటూ సెలూన్ షాపులో పనిచేసేవాడు. బాధిత బాలిక కూడా అదే ప్రాంతంలో శివ ఇంటి పక్కనే ఉండేది. బాలిక ప్రతిరోజు ఆడుకోవడానికి శివ ఇంటికి వెళ్లేది. 2014 మే 14వ తేదీన బాలిక ఆడుకోవడానికి శివ ఇంటికి వెళ్లగా... చాలా సమయం గడిచినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి ఆందోళన చెంది వెతకడం ప్రారంభించింది. కొంతసేపటి తర్వాత బాలిక ఏడుస్తూ ఇంటికి చేరుకుంది. ఏం జరిగిందని తల్లి అడగగా, పక్కింటిలో ఉన్న శివ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పింది. వెంటనే బాలిక తల్లి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడు శివపై పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ఇమ్మానుయేల్ ఈ కేసును దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.



# పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో మోసం

**నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**

విశాఖ సిటీ: పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసి రూ.లక్షలు టోకరా వేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మురళీనగర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి టెలీగ్రామ్‌కు గతేడాది సెప్టెంబర్‌లో పార్ట్ టైమ్ జాబ్ గురించి ఒక మెసేజ్ వచ్చింది. రోజుకు రూ.3 నుంచి రూ.4 వేలు వరకు సంపాదించుకోవచ్చని అందులో పేర్కొన్నారు. అతడిని '21146 రికార్డ్ బ్రేకర్' అనే గ్రూప్‌లో యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లో టాస్క్‌లు చేయడం ద్వారా మంచి ఆదాయం సంపాదించుకోవచ్చని పోస్టులు పెట్టేవారు. లింక్ ఓపెన్ చేయగానే కొన్ని ఉత్పత్తులు కనిపించాయి. వాటిని కొనుగోలు చేసి వాటి స్క్రీన్ షాట్లు టెలీగ్రామ్ గ్రూప్‌లో పోస్టు చేయగా ఒక టాస్క్‌కు రూ.150 చొప్పున కమీషన్ వస్తుందని చెప్పారు. వారి మాటలు నమ్మి బాధితుడు రూ.10 వేలు ఐఎంపీఎస్ ద్వారా వారు పంపించిన బ్యాంక్ అకౌంట్‌కు పంపించాడు. దానికి నేరగాళ్లు రూ.4 వేలు కలిపి మొత్తంగా రూ.14 వేలు తన అకౌంట్‌కు పంపించారు. బాధితుడు మరోసారి రూ.10 వేలు పంపించగా, టెలీగ్రామ్ ద్వారా ఆన్‌లైన్ టాస్క్‌లు చేయాలని ఒక లింక్‌ను పంపించారు. ఆ లింక్‌లో కూడా గతంలో తాను చేసిన టాస్క్‌లు ఉన్నాయి. అవి పూర్తి చేశాక అతడికి లగ్జరీ ప్యాక్ పంపించి అది అన్‌లాక్ చేయాలంటే మరో రూ.13,478 ఇన్వెస్ట్ చేయాలని చెప్పారు. అది నమ్మిన బాధితుడు మళ్లీ పంపించగా అతడి అకౌంట్‌కు రూ.26,676 జమ చేశారు. వారు వెంటనే మరో లగ్జరీ ప్యాస్ పంపించి అన్‌లాక్ చేయాలంటే రూ.1,95,952 ఇన్వెస్ట్ చేయాలని చెప్పారు. చేయకపోతే ఇప్పటి వరకు ఇన్వెస్ట్ చేసిన అమౌంట్ ఫ్రీజ్ అవుతుందని బెదిరించారు. దీంతో బాధితుడు భయపడి ఆ మొత్తాన్ని పంపించి మోసపోయాడు. డబ్బులు రాకపోవడంతో బాధితుడు విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పార్ట్ టైమ్ జాబ్ పేరుతో బ్యాంకు ఖాతాలు**

బాధితుడు పంపించిన డబ్బు కృష్ణా జిల్లాకు చెందిన ఒక అకౌంట్‌కు వెళ్లినట్లు గుర్తించారు. అతడిని ప్రశ్నించగా.. ఒక టెలీగ్రామ్ ఛానెల్‌లో పార్ట్‌టైమ్ జాబ్ అని చెప్పి, దానికి బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి ఇస్తే ఆ అకౌంట్‌లో డబ్బు వేస్తామని, వాటిని వెంటనే విత్‌డ్రా చేసి వారు ఇచ్చిన అకౌంట్‌లో సీడీఎంఏ ద్వారా డిపాజిట్ చేస్తే రూ.లక్షకు రూ.800 నుంచి రూ.1000 కమీషన్‌గా వస్తుందని చెప్పడంతో అలా అకౌంట్లు ఇచ్చినట్లు చెప్పారు. వారు డబ్బులు వేసిన అకౌంట్‌ను పరిశీలించగా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి అతడిని పోలీసులు విచారించారు. తనకు ఎడ్డీలీ అనే వ్యక్తి పరిచయమై సైబర్ క్రైమ్‌లో వచ్చిన కరెన్సీని క్రిప్టో కరెన్సీలో మార్చడం కోసం సీడీఎంఏ మెషీన్ ద్వారా డబ్బులు తీసుకొని దానితో విదేశాల్లో క్రిప్టో కరెన్సీని కొని, దానిని సైబర్ మోసగాళ్లకు టెలీగ్రామ్ ద్వారా ఇస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి అతని మొబైల్ ఫోన్‌ను చెక్ చేయగా బినాన్స్ వ్యాలెట్‌లో 90 వేల యూఎస్‌డీటీ క్రిప్టో కరెన్సీ ఉన్నట్లు గుర్తించారు. వాటిని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో సీజ్ చేశారు.

## షర్మిలతో కాంగ్రెస్ పూర్తి నిర్వీర్యం


రాష్ట్ర నాయకత్వంపై ఫిర్యాదు చేస్తున్న పాడేరు నాయకులు

తాటిచెట్లపాలెం: పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని వివిధ జిల్లాల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో సోమవారం విశాఖలో జరిగిన ప్రత్యేక సమావేశంలో వీరు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి షర్మిలకు, ఆమె తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా మెమోరాండంలు కిల్లి కృపారాణికి అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలిచే వారికి కాకుండా.. అధినాయకత్వం ప్రకటించిన వారిని కాదని షర్మిల కొత్త వారికి టికెట్లిచ్చి కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమయ్యారని మండిపడ్డారు. మొదటి నుంచి పార్టీలో ఉన్నవారికి కూడా ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార పక్షంతో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కలిసిపోయిందని.. ప్రభుత్వంపై పోరాడాల్సింది పోయి, గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తూ, దూషిస్తూ పచ్చ మీడియాలో పతాక శీర్షికలో నిలిచేందుకు తప్ప మరేమి చేయడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఊపిరి పోసుకోవాలంటే రాష్ట్ర నాయకత్వ మార్పు అత్యవసరమని నేతలంతా కుండబద్దలు కొట్టారు. కిల్లి కృపారాణి మాట్లాడుతూ ఇక్కడి విషయాలను సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలకు తెలియజేసి, వినతులను పార్టీ అధిష్టానానికి అందజేస్తానన్నారు.

# పల్లా శ్రీనివాసరావుపై న్యాయపోరాటం

- అన్ని పార్టీల మద్దతు కోరతా
- ఎమ్మెల్యే పదవి నుంచి గాజువాక ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి
- తెలుగు శక్తి అధ్యక్షుడు జీవీ రామ్



తాటిచెట్లపాలెం: గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుపై అన్ని పార్టీల మద్దతుతో న్యాయపోరాటం చేస్తానని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ తెలిపారు. తాను వ్యక్తిగతంగానే పోరాడుతున్నానని, ఈ పోరాటానికి కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ, లోక్‌సత్తా తదితర పార్టీల మద్దతు కోరుతున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం హోటల్ సింకా గ్రాండ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుల సమావేశంలో పాల్గొన్న పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీకి ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే చంపేస్తారా? అని రామ్ ప్రశ్నించారు. పల్లా శ్రీనివాస్ తనపై హత్యాయత్నం చేశారని, గాజువాకలో భూకబ్జాల మాఫియాకు మారుపేరుగా పల్లా శ్రీనివాస్ నిలిచారని ఆరోపించారు. ఇటువంటి వ్యక్తిని వెంటనే పార్టీ నుంచి బహిష్కరించి, చర్యలు తీసుకోవాలని కోరారు. తనపై జరిగిన దాడి విషయమై గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని, పోలీస్ కమిషనర్‌ను కూడా కలిశానని, ఆయనపై నమ్మకం ఉందన్నారు. పల్లా శ్రీనివాసరావుపై సీబీఐ, కేంద్ర హోం శాఖకు కూడా ఫిర్యాదు చేశానని రామ్ తెలిపారు. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం అని భావించానని, కానీ టీడీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారన్నారని మండిపడ్డారు. పల్లా శ్రీనివాసరావు దగ్గర ఉండే మురళీ అతని వ్యవహారాలన్నీ చూస్తూ సెటిల్‌మెంట్లు, కలెక్షన్స్ చేస్తుంటాడని ఆరోపించారు. అన్ని పార్టీలతో కలిసి న్యాయపోరాటం చేస్తానని, ఈ విషయమై ఇప్పటికే బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిశానని, కాంగ్రెస్ నాయకులను కలిశానని, త్వరలోనే వైఎస్సార్ సీపీ, కమ్యూనిస్టులు, లోక్‌సత్తా నాయకులను కలుస్తానని రామ్ తెలిపారు. ప్రాణ రక్షణ కోసం తనకు గన్ లైసెన్స్ ఇప్పించాలని పోలీస్ కమిషనర్‌ను కోరనున్నట్లు బీవీ రామ్ తెలిపారు.

# కృత్రిమ ఆవాసాలు, సీ వీడ్‌కు మంచి గిరాకీ

**మంత్రి అచ్చెన్నాయుడు**


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న అచ్చెన్నాయుడు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర సముద్ర జలాల్లో మత్స్య సంపద వృద్ధి కోసం మొదటి విడతగా 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మత్స్య, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జాలారి ఎండాడ సముద్రంలో కృత్రిమ ఆవాసాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిషింగ్ హార్బర్‌లో మరపడవల బోట్లకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద 634 ట్రాన్స్‌పాండర్లను 100 శాతం సబ్సిడీపై అందజేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌పాండర్ల వాడకం వల్ల సముద్రంలో బోటు స్థానాన్ని తెలుసుకోవడం, తుఫానులు, ప్రమాదాల సమయంలో ఉపయోగపడుతుందని చెప్పారు. మత్స్యకారులకు జీపీఎస్, బోట్లు, ఇంజన్లు, వలలు వంటి పరికరాలను సబ్సిడీపై సరఫరా చేస్తామని మంత్రి తెలిపారు. ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్, క్రెడిల్స్ ఏర్పాటుకు పోర్టు చైర్మన్‌తో మాట్లాడతానని చెప్పారు. ఆర్కే బీచ్ ఎదురుగా ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్, సీ వీడ్ కల్చర్ యూనిట్‌ను మంత్రి సందర్శించారు. సీవీడ్‌కు విదేశాల్లో మంచి గిరాకీ ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా 22 సీవీడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, వీటి ద్వారా 45 రోజుల్లోనే ఆదాయం వస్తుందని మంత్రి తెలిపారు. కేజ్ కల్చర్ ద్వారా మత్స్య సంపదను అభివృద్ధి చేసుకోవచ్చని, సీవీడ్‌ను ఆధారం చేసుకుని చిన్న పరిశ్రమగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, విశాఖ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. సీ కేజ్ అమ్మకాలు ద్వారా వచ్చిన రూ.3.25 లక్షల చెక్కును లబ్ధిదారులకు మంత్రి అందజేశారు.

## ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూలు చేయరాదు

తాటిచెట్లపాలెం: జిల్లా తూనికలు , కొలతలు (లీగల్ మెట్రాలజీ) శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ జి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్యాకేజీలపై ముద్రించిన గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేయకూడదని వ్యాపారులను ఆదేశించారు. వినియోగదారుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కె. థామస్ రవి కుమార్, అసిస్టెంట్ కంట్రోలర్లు , ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.